www.aksharamedassu.com

APTEL/26/A8343

తెలుగుపత్రిక

అక్షర మేధస్సు

అక్షరమే ఆయుధం మేధస్సే మా మార్గం



ప్రచురణ : అనంతపురం సత్యసాయి | ఎడిటర్ : యన్ రంగనాథ్ | సంపుటి : 01 | సంచిక : 28 | పేజీలు : 04 | బుధవారం 18 - 11 - 2026 | వెల : 01/-

సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు
ఎన్వోసీ కోరిన రేవంత్ రెడ్డి

- సానుకూలంగా స్పందించిన ఛత్తీస్‌గఢ్ సీఎం
- గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్వోసీ ఇవ్వాలని ఛత్తీస్‌గడ్ సీఎం విష్ణుదేవ్ సాయిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు
- ఎన్వోసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేసేందుకు హామీ ఇచ్చారు
- ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయితో సీఎం రేవంత్ రెడ్డి భేటీ



హైదరాబాద్ :

సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాల వేగం పెంచింది. రెండు రోజుల క్రితం ప్రధాని నరేంద్ర మోదీతోనూ చర్చించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ దిల్లీ నుంచి నేరుగా రాయ్‌పూర్ వెళ్లి ఛత్తీస్‌గడ్ సీఎం విష్ణుదేవ్‌సాయితో భేటీ అయ్యారు. సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణానికి నిరభ్యంతర పత్రం ఇవ్వాలని ఛత్తీస్‌గడ్ సీఎంను రేవంత్ రెడ్డి కోరారు. ఎల్‌నినో పరిస్థితుల వల్ల తెలంగాణలో నీటి అవసరాలు పెరిగే అవకాశం ఉందని సీఎం వివరించారు. సమ్మక్క సాగర్ బ్యారేజీలో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుమతి ఇవ్వడంతో పాటు ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన అనుమతులకూ సహకరించాలని కోరారు.ఛత్తీస్‌గఢ్‌లో భూసేకరణ, పరిహారం, పునరావాసానికి అవసరమైన నిధులను నిబంధనల ప్రకారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఛత్తీస్‌గడ్ ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి ఎన్వోసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేసేందుకు హామీ ఇచ్చినట్లు తెలంగాణ సీఎంవో తెలిపింది. ఛత్తీస్‌గడ్ ముఖ్యమంత్రిని కలిసిన బృందంలో రేవంత్ రెడ్డితో పాటు ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులు ఉన్నారు. గోదావరి నదిపై నిర్మించిన సమ్మక్క సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావాలంటే - మిగతా 2 లో

తెలంగాణ ఇచ్చింది సోనియమ్మే అయితే..
ఆత్మకథలో ఎందుకు రాయలేదు?



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సోనియా ఆత్మకథలో తెలంగాణ ఏర్పాటు ప్రస్తావన లేదన్న కేటీఆర్
- తెలంగాణ ఇచ్చింది సోనియమ్మే అయితే సమాధానం చెప్పాలని డిమాండ్
- ఇది ప్రజల పోరాట ఫలితం.. సోనియా దయాభిక్ష కాదని స్పష్టీకరణ
- ఉద్యమ కాలం నాటి పాదయాత్రను గుర్తు చేసుకుంటూ పోస్ట్

హైదరాబాద్ :

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీని లక్ష్యంగా చేసుకుని సూటి ప్రశ్న సంధించారు. సోనియా గాంధీ గుండెల్లో తెలంగాణ ఉంటే, ఆమె - మిగతా 2 లో



హైదరాబాద్‌లో
రోడ్ల పండుగ

- హాజరుకానున్న 3000 మందికి పైగా దేశ, విదేశీ ప్రతినిధులు
- హైదరాబాద్‌లో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ 85వ వార్షిక సదస్సు
- 19న ప్రారంభించనున్న సీఎం రేవంత్ , కేంద్ర మంత్రి గడ్కరీ
- తెలంగాణ సంస్కృతి, అభివృద్ధిని చాటేలా ప్రత్యేక ఏర్పాట్లు

హైదరాబాద్ :

భారత రహదారుల కాంగ్రెస్ (ఐఆర్‌సీ) 85వ వార్షిక సదస్సుకు హైదరాబాద్ నగరం వేదికైంది. ఈ నెల 19 నుంచి - మిగతా 2 లో

పోటీ కాదు, సహకారమే
మన భవిష్యత్తు

- ఆసియాన్ సదస్సులో ప్రధాని మోదీ
- భారత్ అభివృద్ధి, ఆసియాన్ శ్రేయస్సు ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయన్న మోదీ
- 'యాక్ట్ ఈస్ట్' విధానంతో ఇరుపక్షాల మధ్య బంధం మరింత బలోపేతం
- వికసిత భారత్ 2047, ఆసియాన్ విజన్ 2045 లక్ష్యాలు కీలకం
- ప్రస్తుత ప్రపంచానికి శాంతి, స్థిరత్వం ఎంతో అవసరమని వ్యాఖ్య



ఢిల్లీ :

భారత్ అభివృద్ధి, ఆసియాన్ దేశాల శ్రేయస్సు ఒకదానితో ఒకటి గాఢంగా ముడిపడి ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇరుపక్షాల భవిష్యత్తును పోటీతత్వం కాకుండా సహకారం నిర్దేశించాలని ఆయన పిలుపునిచ్చారు. మనీలాలో జరిగిన 23వ ఇండియా-ఆసియాన్ సదస్సులో మోదీ ప్రసంగించారు.భారత్, ఆసియాన్ దేశాలు కలిస్తే ప్రపంచ జనాభాలో దాదాపు నాలుగో వంతు ఉంటాయని మోదీ గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో మన - మిగతా 2 లో

కెరీర్‌లో ఇది
మంచి అవకాశం

- మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల
- 60 వేల మంది ఉద్యోగులకు వాలంటరీ ఎగ్జిట్ ప్రకటించిన మైక్రోసాఫ్ట్
- భారత్, అమెరికా సహా నాలుగు దేశాల్లోని సిబ్బందికి అవకాశం
- ఏఐ విస్తరణతో పనితీరులో వస్తున్న పెను మార్పులే కారణమన్న సత్య నాదెళ్ల
- కెరీర్‌లో మార్పు కోరుకునే వారికి ఆర్థిక వెసులుబాటు కల్పించడమే లక్ష్యం
- సంస్థలో కొనసాగే వారికి సరికొత్త అవకాశాలు వస్తాయని వెల్లడి





మణుగూరులో
వరుస ప్రకంపనలు

- ఊగిన ఇళ్లు, హడలిపోయిన ప్రజలు
- మణుగూరు ప్రాంతంలో వరుసగా రెండుసార్లు భూప్రకంపనలు
- ఉదయం సమయంలో భారీ శబ్దాలు రావడంతో ఇళ్ల నుంచి పరుగులు తీసిన స్థానికులు
- భూకంప తీవ్రతపై ఇంకా అధికారిక సమాచారం విడుదల చేయని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ
- గోదావరి లోయ ప్రాంతంలో గతంలోనూ నమోదైన పలు స్వల్ప ప్రకంపనల ఘటనలు

హైదరాబాద్ :

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పరిసర ప్రాంతాల్లో నేడు (నవంబర్ 17) వరుసగా భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ఉదయం సమయంలో స్వల్ప వ్యవధిలోనే రెండుసార్లు భూమి కంపించడంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఏం జరుగుతుందో అర్థంకాక ఇళ్ల నుంచి ఒక్కసారిగా రోడ్లపైకి పరుగులు తీశారు.స్థానికులు తెలిపిన - మిగతా 2 లో

మోదీ చాలా
'టఫ్ మ్యాన్'

- క్వాడ్ వేదికగా భారత ప్రధానిపై ట్రంప్ వ్యాఖ్యలు
- మనీలాలో జరిగిన క్వాడ్ సదస్సులో మోదీని 'గట్టి వాడు'గా అభివర్ణించిన ట్రంప్
- క్వాడ్ సమావేశంలో భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాధినేతల చర్చలు
- 85 మిలియన్ డాలర్ల వ్యయంతో ఏఐ యాక్సిలరేటర్ ప్రారంభమిస్తామన్న ట్రంప్
- సముద్ర జలాల రక్షణ కోసం 4 దేశాల సైన్యాలతో ఉమ్మడి మిలిటరీ విన్యాసాలు
- అరుదైన ఖనిజాల ఉత్పత్తిలో భారత్, జపాన్ భాగస్వామ్యాన్ని కొనియాడిన ట్రంప్



ఢిల్లీ :

ఫిలిప్పీన్స్‌లోని మనీలా వేదికగా జరిగిన క్వాడ్ దేశాల సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రెండేళ్ల తర్వాత, ఆసియాన్ సదస్సు సందర్భంగా జరిగిన - మిగతా 2 లో

శబరిమలలో తిరుపతి తరహా మెగా ప్రాజెక్టు

- తిరుపతి మోడల్‌లో శబరిమల అభివృద్ధి.. కేరళ ప్రభుత్వం కీలక నిర్ణయం
- అయ్యప్ప భక్తులకు అత్యాధునిక వసతులు
- సమగ్ర మౌలిక వసతుల కల్పన
- కొచ్చి విమానాశ్రయంలో 5,000 చదరపు అడుగుల్లో ప్రత్యేక సేవా కేంద్రం
- భక్తుల రాకను మరో 50 శాతం పెంచడమే ప్రభుత్వ లక్ష్యం



కేరళ :

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమలలో తిరుమల-తిరుపతి తరహాలో భారీ మౌలిక వసతుల ప్రాజెక్టును అమలు చేయనున్నట్లు కేరళ ముఖ్యమంత్రి పీడీ సతీశన్ ప్రకటించారు. శబరిమలకు వచ్చే అయ్యప్ప భక్తులకు సమగ్రమైన రీతిలో అత్యాధునిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఈ మెగా ప్రాజెక్టును రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయం (సియాల్) ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శబరిమల యాత్రికుల సహాయ కేంద్రాన్ని (ఫెసిలిటేషన్ సెంటర్) ముఖ్యమంత్రి ప్రారంభించారు. - మిగతా 2 లో

ఏపీ వైపు దూసుకొస్తున్న
'అక్వాన్' తుపాను

- తీర ప్రాంతాలకు హెచ్చరిక!
- ఆగ్నేయ బంగాళాఖాతంలో అక్వాన్ తుపాను
- శుక్రవారం నెల్లూరు-తుని మధ్య తీరం దాటే సూచన
- తుపానుపై సీఎం చంద్రబాబు సమీక్ష, యంత్రాంగం అప్రమత్తం
- తీర ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక



అమరావతి :

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తుపాను ఏపీ తీరం వైపు దూసుకొస్తోంది. ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ తుపాను.. నేటి సాయంత్రానికి తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఎస్‌డీఎంఏ) వెల్లడించింది. గడిచిన ఆరు గంటల్లో గంటకు 3 కిలోమీటర్ల వేగంతో కదులుతున్నట్లు అధికారులు తెలిపారు.ప్రస్తుతం ఈ తుపాను చెన్నైకి 610 కి.మీ, మచిలీపట్నానికి 660 కి.మీ, విశాఖపట్నానికి 670 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉందని ఎస్‌డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ గురువారం (నవంబర్ 19) ఉదయానికి అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. శుక్రవారం (నవంబర్ 20) మధ్యాహ్నం నాటికి నెల్లూరు, తుని మధ్య తీరం దాటవచ్చని భావిస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 120-130 కిలోమీటర్ల - మిగతా 2 లో

కోనసీమ ఓఎన్జీసీ బావి
మంటలు అదుపులోకి!



- కోనసీమ జిల్లా రాజోలులో అదుపులోకి వచ్చిన ఓఎన్జీసీ గ్యాస్ బావి మంటలు
- దాదాపు 10 గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేసిన నిపుణులు
- తెల్లవారుజామున 4:30 గంటల సమయంలో భారీ శబ్దంతో చెలరేగిన అగ్నికీలలు
- ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించిన సీఎం చంద్రబాబు
- పరిస్థితి అదుపులోకి రావడంతో ఊపిరి పీల్చుకున్న స్థానిక గ్రామాల ప్రజలు

ఆంధ్రప్రదేశ్‌కి ఆర్థిక
సాయం అందించండి

- ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలతో సీఎం చంద్రబాబు భేటీ
- నిర్మలా సీతారామన్‌కు సాయంపై సీఎం చంద్రబాబు విజ్ఞప్తి
- ఢిల్లీలో సీఎం చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు
- రాయలసీమ హార్టీకల్చర్ హబ్ ప్రాజెక్టుపైతో పాటు పలు అంశాలపై చర్చించారు
- తుపాను నష్టాలకు ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి
- నష్టానికి సంబంధించిన నివేదికలు ఇప్పటికే పంపామని వెల్లడి



అమరావతి :

ముఖ్యమంత్రి చంద్రబాబు దిల్లీలో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలోనే చంద్రబాబు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేంద్రం నుంచి ఏపీకి అందాల్సిన ఆర్థిక సాయం, రాయలసీమ అభివృద్ధికి కీలకమైన హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై కీలక చర్చలు జరిపారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు సంబంధించి ఇప్పటికే సిద్ధం చేసిన ప్రతిపాదనలను కార్యరూపంలోకి తీసుకురావాలని నిర్మలా సీతారామన్‌ను సీఎం కోరారు.వరుస తుపాన్లు, ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రం ఎదుర్కొంటున్న నష్టాలు, ఆర్థిక ఇబ్బందులను నిర్మలా సీతారామన్ దృష్టికి చంద్రబాబు తీసుకెళ్లారు. అర్నబ్, మురను తుపాన్ల వల్ల జరిగిన నష్టంపై ఇప్పటికే కేంద్రానికి సమగ్ర వివరాలు పంపామని గుర్తు చేశారు. ఎల్‌నినో పరిస్థితుల కారణంగా తలెత్తిన సమస్యలను కూడా వివరించి ఏపీకి అవసరమైన ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

సంపాదకీయం

అమెరికా ఎన్నికల్లో సాంస్కృతిక పోరాటాల్లేవ్ !



అమెరికాలో జరిగిన మధ్యంతర ఎన్నికలు 'తప్పులు సరిదిద్దుకోవటం'లో ప్రజాస్వామ్యానికున్న బలాన్ని చాటాయి. చాలామంది ఊహించినదాని కంటే ఎక్కువ మార్పునే అమెరికా ఓటర్లు చూపారు. అధ్యక్షుడు తాననుకున్నది చేయటానికి కాంగ్రెస్‌లో మెజారిటీ కీలకం. లేదంటే విదేశీ విధానాల్లో, రక్షణ, దేశ భద్రత విషయాలలో తప్ప ఎగ్జిక్యూటివ్ ఆదేశాల ఫలితాలు పరిమితంగా ఉంటాయి. తాజా ఎన్నికల తర్వాత ప్రతినిధుల సభలో డెమోక్రాటిక్ పార్టీ భారీ మెజారిటీ సాధించింది. సెనేట్‌లోనూ దాని ఆధిక్యం గణనీయంగా పెరిగింది. అధ్యక్షుడి రెక్కలు కత్తిరించారు ప్రజలు. అటు ప్రతినిధుల సభ, ఇటు సెనెట్ రెండింటి లోనూ అధికార పార్టీకి భారీ వ్యతిరేకత వ్యక్తమవటం చాలా అరుదు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 1946, 1994, 2010లో మాత్రమే అలా జరిగింది.సరిహద్దుల్ని కట్టుదిట్టం చేసి, అక్రమ వలసల్ని ఆపుతారనే నమ్మకంతోనే ట్రంప్‌కి చాలామంది సంప్రదాయ డెమోక్రాట్ ఓటర్లు మద్దతిచ్చారు. కానీ దాన్ని క్రూరంగా, మానవ హక్కుల ఉల్లంఘనలా, ఆయా దేశాల్లో ఎన్నికైన ప్రభుత్వాధినేతల్ని అవమానించేలా మార్చి ట్రంప్ వ్యవహరించటం, వాచాలత్వాన్ని ప్రదర్శించటం అధిక శాతం అమెరికన్లకు ఆమోదయోగ్యం కాలేదు. అదేవిధంగా, ఇరాన్‌పై యుద్ధంతో అనుకున్న ప్రయోజనాలు నెరవేరకపోగా ఇంధన సంక్షోభాన్ని సృష్టించి, డీజిల్, గాసోలిన్ ధరలు పెరిగేట్టు చేసింది. అమెరికా విదేశాంగ విధానం ఆధారంగా ఆ దేశ ప్రజలు ఓటు వేయటం ప్రచ్ఛన్న యుద్ధకాలంలో కూడా అరుదు. కానీ, ఈసారి సుంకాలు, ఇరాన్ యుద్ధం పర్యవసానంగా స్థానికంగా ఇంధన ధరలు, ఇతర వ్యయాలు అధికమైనాయి. సగటు అమెరికన్లకు ఉపాధి అవకాశాలు పెరగకపోగా, వలసవిధానం అమలు తీరుతో రైతులు, చిన్నా పెద్దా సంస్థలు మానవ వనరులు దొరక్క ఇబ్బంది పడ్డాయి. వీటన్నింటికీ అధ్యక్షుడి అరాచక ధోరణే కారణమని ప్రజలు భావించారు. కంచుకోటల్లాంటి రాష్ట్రాల్లోనూ రిపబ్లికన్ పార్టీ ఓడింది. ఆఫ్రో అమెరికన్, లాటిన్ అమెరికన్ తొలిసారి గవర్నర్లుగా ఎన్నికయ్యారు. ఎనిమిది రాష్ట్రాల్లో రిపబ్లికన్‌లకు అనుకూలంగా 16 స్థానాలను ట్రంప్ పునర్విభజించినా కొత్త కాంగ్రెస్ సీట్లలో ప్రతి అయిదులో ఒకటి మాత్రమే రిపబ్లికన్లు గెలవగలిగారు. ప్రపంచ ప్రజాస్వామ్యానికి దిక్సూచిలాంటి తమ దేశం అప్రజాస్వామిక, భావోద్వేగ నిర్ణయాల బారిన పడటాన్ని సహించలేని అమెరికన్లు జాతి, మత, తెగ, వర్ణాలకు అతీతంగా ఏకమైనారు. తాము ఏ పార్టీకీ శాశ్వత ఓటర్లం కాదని, కొన్ని విలువలకి, తమ జీవితంలో బాగోగులకి అనుగుణంగా ఓటుని మార్చుకునే శక్తి ఉందని రుజువు చేశారు. ఇలా ఓటర్లు పార్టీ విధేయత కంటే విలువలు, ఉమ్మడి ప్రయోజనాలకి పెద్దపీట వెయ్యటం ప్రజాస్వామ్యం మనుగడకి, విజయానికి కీలకం. ఈ మధ్యంతర ఫలితాల తర్వాత రిపబ్లికన్ పార్టీ తిరిగి తన అంతర్గత ప్రజాస్వామ్యాన్ని సమీక్షించుకోవచ్చు. ట్రంప్ నీడ నుంచి పలువురు నేతలు బయటపడి ప్రజాస్వామ్యానికి కీలకమైన హేతుబద్ధతతో వ్యవహరించవచ్చు.ఈ ఎన్నికల్లో ఎటువంటి సాంస్కృతిక పోరాటాలూ లేవు. కేవలం అధ్యక్షుడి వ్యవహారశైలి వల్ల రోజువారీ జీవితంలో కష్టాలు పడుతున్నామన్న భావనే ప్రజల ఓటింగ్ సరళిని మార్చింది. టెక్సాస్, ఓహయో, జార్జియా లాంటి మితవాద రాష్ట్రాలన్నింటిలోనూ డెమోక్రాటిక్ పార్టీ ఘనవిజయం సాధించింది. ఫ్లోరిడాలో గవర్నరు ఎన్నికలో కేవలం 1.3శాతం ఓట్లతో డెమోక్రాట్లు ఓడారు. అమెరికన్ ప్రజల ఓటు డెమోక్రాటిక్ పార్టీలో వామపక్ష అతివాదులకు కాక, మధ్యేవాద, మితవాదులకి అనుకూలంగా పడింది. డెమోక్రాట్లు తమ పార్టీ బలాన్ని పెంచుకోవాలంటే ఈ మధ్యేవాద రాష్ట్రాలలో ప్రజలని ఆకట్టుకోవాలి. ఈ పరిస్థితి డెమోక్రాటిక్ పార్టీ భవిష్యత్తుకి, అమెరికన్ ప్రజాస్వామ్యానికి మంచి పరిణామం. అతివాదం, మితిమీరిన పక్షపాత ధోరణి, ద్వేష రాజకీయం స్థానంలో మితవాదం, మధ్యేమార్గం, ఇతర వర్గాలతో ఇచ్చిపుచ్చుకునే ధోరణి బలపడే అవకాశం ఉంది.

ఏపీ వైపు దూసుకొస్తున్న 'అక్వాన్' తుపాను

మొదటిపేజీ తరువాయి - వేగంతో గాలులు వీస్తాయని, గరిష్ఠంగా గాలి వేగం 145 కిలోమీటర్లకు చేరే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం ఉదయం అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను గమనాన్ని అడిగి తెలుసుకున్నారు. సాయంత్రానికి తుపాను తీవ్రతపై మరింత స్పష్టత వస్తుందని అధికారులు సీఎంకు వివరించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. విపత్తుల పట్ల ఆందోళన చెందకుండా, ప్రజలకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా చూడాలన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు 'స్వర్ణ గ్రామ', 'స్వర్ణ వార్డు' సిబ్బంది ద్వారా నేరుగా సమాచారం అందించాలని సూచించారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలితే తక్షణమే పునరుద్ధరణ పనులు చేపట్టాలని, ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రజలకు భరోసా ఇవ్వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

కోనసీమ ఓఎన్జీసీ బావి మంటలు అదుపులోకి!

మొదటిపేజీ తరువాయి - డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో తీవ్ర కలకలం రేపిన ఓఎన్జీసీ గ్యాస్ బావి మంటలు ఎట్టకేలకు అదుపులోకి వచ్చాయి. రాజోలు నియోజకవర్గ పరిధిలోని ఒక గ్యాస్ డ్రిల్లింగ్ బావిలో మంగళవారం తెల్లవారుజామున భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. రంగంలోకి దిగిన ఓఎన్జీసీ నిపుణుల బృందం దాదాపు 10 గంటల పాటు నిరంతరాయంగా శ్రమించి మంటలను పూర్తిగా నియంత్రించింది.నవంబర్ 17 తెల్లవారుజామున సుమారు 4:30 గంటల ప్రాంతంలో ఈ గ్యాస్ వెల్ వద్ద అకస్మాత్తుగా భారీ శబ్దం వినిపించింది. ఆ వెంటనే పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఆకాశాన్ని తాకేలా చెలరేగిన అగ్నికీలలను చూసి సమీప గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే ఓఎన్జీసీ అత్యవసర సాంకేతిక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశాయి. ప్రత్యేక పరికరాలు, నిపుణుల వ్యూహాలతో తీవ్రంగా శ్రమించి, మధ్యాహ్నం సమయానికి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.ఈ ప్రాంతంలో గ్యాస్ లీకేజీ తలెత్తిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా వెంటనే అప్రమత్తమైంది. ప్రమాద తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, సమీప ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో యంత్రాంగం వేగంగా స్పందించి తగిన చర్యలు చేపట్టింది.దాదాపు 10 గంటల పాటు సాగిన ఆపరేషన్ విజయవంతమై, మంటలు పూర్తిగా ఆరిపోవడంతో పరిసర గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం ఘటనా స్థలంలో పరిస్థితి పూర్తిగా నియంత్రణలో ఉందని, నిపుణులు పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నారని అధికారులు స్పష్టం చేశారు.

తెలంగాణ ఇచ్చింది సోనియమ్మే అయితే.. ఆత్మకథలో ఎందుకు రాయలేదు?

మొదటిపేజీ తరువాయి - రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' ఆత్మకథలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రస్తావన ఎందుకు లేదని నిలదీశారు. 'తెలంగాణ ఇచ్చింది సోనియమ్మే' అని చెప్పుకునే కాంగ్రెస్ నాయకులు ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్రం సోనియా గాంధీ దయాభిక్ష కాదని, అది తెలంగాణ ప్రజల పోరాట ఫలితమని కేటీఆర్ స్పష్టం చేశారు. తాజాగా ఆయన ఎక్స్ వేదికగా ఈ వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు తెలంగాణ ఉద్యమ కాలం నాటి జ్ఞాపకాలను కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. ఉద్యమంలో భాగంగా 2011 నవంబర్ 16 నుంచి 21 వరకు తాను చేపట్టిన పాదయాత్రకు 15 ఏళ్లు పూర్తయినట్లు తెలిపారు.ఉద్యమ నాయకుడు కేసీఆర్ పిలుపు మేరకు ఆరు రోజుల పాటు సాగిన ఆ పాదయాత్ర తనకు ఓ గొప్ప జ్ఞాపకమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఉద్యమ చరిత్రను ప్రస్తావిస్తూ, సోనియా గాంధీపై, కాంగ్రెస్‌పై ఆయన ఈ విమర్శలు చేసినట్లు స్పష్టమవుతోంది.

మోదీ చాలా 'టఫ్ మ్యాన్'

మొదటిపేజీ తరువాయి - ఈ భేటీలో భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాధినేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీని 'టఫ్ మ్యాన్' (చాలా గట్టి వాడు)గా అభివర్ణించారు. గతంలోనూ పలు అంతర్జాతీయ వేదికలపై మోదీ 'టఫ్ నెగోషియేటర్', తనకంటే చాలా బెటర్ అని ట్రంప్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.ఈ సమావేశంలో క్వాడ్ భాగస్వామ్యాన్ని ప్రపంచంలోనే అత్యంత విజయవంతమైన కూటమిగా ట్రంప్ అభివర్ణించారు. భవిష్యత్ సాంకేతికతకు దిశానిర్దేశం చేసేందుకు 85 మిలియన్ డాలర్ల నిధులతో ప్రత్యేక 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యాక్సిలరేటర్'ను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా సముద్ర జలాల్లో నియంత్రణ సామర్థ్యాలను పెంచేందుకు నాలుగు దేశాలు కలిసి త్వరలోనే ఉమ్మడి సైనిక విన్యాసాలు నిర్వహిస్తాయని స్పష్టం చేశారు. రేర్ ఎర్త్ (అరుదైన ఖనిజాలు) ఉత్పత్తిని పెంచడంలో అమెరికాతో పాటు భారత్, జపాన్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయని, రాబోయే 10 నెలల్లో తమకు అవసరమైన అన్ని వనరులు సమకూరుతాయని ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు.దానైనా పర్యటనలో భాగంగా జిన్‌పింగ్, పుతిన్‌లతో త్రైపాక్షిక అణు చర్చలు జరిపి ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు ప్రయత్నిస్తానని ట్రంప్ వెల్లడించారు. ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో భేటీకి అవకాశం ఉందని, ఇరాన్ అణ్వాయుధాలు సాధించకుండా గట్టి నిఘా ఉంచామని తెలిపారు. మరోవైపు, ఎన్విడియా జాతీయ భద్రతా ప్రతిపాదనను స్వాగతిస్తూనే, ఇటీవల రాజీనామా చేసిన జెన్సన్ హువాంగ్ తిరిగి కంపెనీ సీఈవోగా బాధ్యతలు చేపడితే తనకు ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొన్నారు.

శబరిమలలో తిరుపతి తరహా మెగా ప్రాజెక్టు

మొదటిపేజీ తరువాయి - ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కేరళలో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని విస్తృతంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. అయ్యప్ప భక్తులు శబరిమలలో దర్శనం ముగిసిన వెంటనే వెనుదిరగకుండా, రాష్ట్రంలోని ఇతర ప్రముఖ ఆలయాలను కూడా సందర్శించేలా ఒక ప్రత్యేక నెట్‌వర్క్‌ను రూపొందిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రణాళిక ద్వారా శబరిమలకు వచ్చే భక్తుల సంఖ్య సుమారు 50 శాతం మేర పెరిగే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.శబరిమల దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల కల్పనపై ప్రస్తుతం కొనసాగుతున్న మండల పూజా సీజన్ ముగిసిన తర్వాత ఒక ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే వృశ్చిక మాసం సీజన్ ప్రారంభానికి ముందే అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశామని, పంబ, సన్నిధానంలలో స్వయంగా సమీక్షలు నిర్వహించి ఏర్పాట్లను పర్యవేక్షించినట్లు ఆయన తెలిపారు.మరోవైపు, కొచ్చి విమానాశ్రయంలోని డొమెస్టిక్ అరైవల్ టెర్మినల్ సమీపంలో 5,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ భక్తులకు ఎంతో ఉపయుక్తంగా మారనుంది. ఇక్కడ శబరిమలకు నేరుగా వెళ్లే కేరళ ఆర్టీసీ బస్సుల కోసం ప్రత్యేక బుకింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ బస్సు సర్వీసులను కూడా ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు.దీంతో పాటు డిమాండ్‌కు అనుగుణంగా చార్టర్డ్ బస్సులు, హెలికాప్టర్ బుకింగ్ కౌంటర్, ట్రావెన్‌కోర్ దేవస్వోం బోర్డు హెల్ప్ డెస్క్, ప్రసాదం కూపన్ కౌంటర్లను ఇక్కడ అందుబాటులో ఉంచారు. వీటితో పాటు ప్రీపెయిడ్ ట్యాక్సీ బుకింగ్, శాకాహార భోజన శాల, ఎయిర్ కండిషన్డ్ విశ్రాంతి గదులు, ఉచిత వైఫై, విమానాల రాకపోకలను ఎప్పటికప్పుడు తెలియజేసే ఫ్లైట్ ఇన్ఫర్మేషన్ డిస్‌ప్లే వ్యవస్థను కూడా భక్తుల కోసం ఏర్పాటు చేశారు. దేశ, విదేశాల నుంచి విమానాల్లో వచ్చే అయ్యప్ప భక్తులకు ఈ కేంద్రం ద్వారా ప్రయాణం మరింత సులభతరం కానుంది.

పోటీ కాదు, సహకారమే మన భవిష్యత్తు

మొదటిపేజీ తరువాయి - భవిష్యత్తును పోటీతో కాకుండా సహకారంతో తీర్చిదిద్దుకోవడం చాలా అవసరమన్నారు. రాబోయే సంవత్సరాల్లో 'వికసిత భారత్ 2047', 'ఆసియాన్ కమ్యూనిటీ విజన్ 2045' మన ఉమ్మడి ఆకాంక్షలను సాకారం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.గత కొన్నేళ్లుగా తమ 'యాక్ట్ ఈస్ట్' విధానం భారత్-ఆసియాన్ సంబంధాలకు కొత్త ఊపునిచ్చిందని మోదీ తెలిపారు. తమ భాగస్వామ్యం కేవలం సాంస్కృతిక వారసత్వానికే పరిమితం కాకుండా, డిజిటల్, రక్షణ, అంతరిక్షం వంటి కొత్త రంగాల్లోకి విస్తరిస్తోందని వివరించారు. 2014 నుంచి ప్రజా సంబంధాలను బలోపేతం చేసేందుకు 100కు పైగా కార్యక్రమాలు చేపట్టామని, 250 క్విక్ ఇంపాక్ట్ ప్రాజెక్టులు ప్రారంభించామని, 10,000కు పైగా స్కిల్ బిల్డింగ్ స్కాలర్‌షిప్‌లు అందించామని పేర్కొన్నారు.ప్రస్తుత ప్రపంచం అనేక సంక్షోభాలను ఎదుర్కొంటోందని, శాంతి, స్థిరత్వం గతంలో కంటే ఇప్పుడు ఎంతో అవసరమని మోదీ అన్నారు. ఈ నేపథ్యంలో 'మన భవిష్యత్తును కలిసి నిర్మించుకుందాం' అనే ఈ ఏడాది సదస్సు థీమ్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని చెప్పారు. ఈ సందర్భంగా, సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ రొమాల్డెజ్ మార్కోస్ జూనియర్‌కు మోదీ అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.

సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు ఎన్వోసీ కోరిన రేవంత్ రెడ్డి



మొదటిపేజీ తరువాయి - ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి ఎన్వోసీ కీలకంగా మారింది. ప్రాజెక్టులో నీటిని పూర్తి స్థాయిలో నిల్వ చేసినప్పుడు బ్యాక్ వాటర్ కారణంగా ఛత్తీస్ గఢ్ పరిధిలోని కొన్ని ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశాలున్నాయన్నది ఆ రాష్ట్ర అభ్యంతరం. గతంలోనూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిని కలిసి ప్రాజెక్టు వివరాలను వివరించి ఎన్వోసీ కోరారు.సమ్మక్క సాగర్ ప్రాజెక్టును మొదట కాంతనపల్లి వద్ద ప్రతిపాదించినప్పుడు ఆ ప్రాంతంలో 11,408 ఎకరాల భూమి ముంపునకు గురయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. భద్రతా మౌలిక సదుపాయాలతో పాటు 17 ఆదివాసీ గ్రామాలపై ప్రభావం పడుతుందని గుర్తించడంతో ముంపును తగ్గించేందుకు బ్యారేజీ నిర్మాణ ప్రాంతాన్ని తుపాకులగూడెంకు మార్చారు. ఐఐటీ ఖరగ్‌పూర్ అధ్యయనం ప్రకారం పూర్తి స్థాయి నీటి మట్టం వద్ద ఛత్తీస్‌గఢ్‌లో సుమారు 33 ఎకరాలు ముంపునకు గురి కానుంది. భారీ వరదల సమయంలోనూ ప్రభావిత ప్రాంతం వంద ఎకరాలకు మించదు. ఐఐటీ ఖరగ్‌పూర్ తన నివేదికను జులై 30న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి సమర్పించింది. అధ్యయనం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన రూ.9 కోట్ల 88లక్షలను తెలంగాణ ప్రభుత్వం ఏప్రిల్‌లోనే చెల్లించింది.ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం పూర్తయింది. పూర్తి స్థాయి నీటి మట్టం వద్ద దీని నిల్వ సామర్థ్యం 6.94 టీఎంసీలు. కరవు ప్రభావిత, వెనుకబడిన, గిరిజన ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలకు గోదావరి జలాలను వినియోగించాలనేది ఈ ప్రాజెక్టు లక్ష్యం. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను వినియోగించుకుని ఎస్సారెస్పీ రెండో దశ కింద సుమారు నాలుగు లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టును స్థిరీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రామప్ప-పాకాల లింక్ కెనాల్ ద్వారా మరో 30 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రణాళిక రూపొందించారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి ఎన్వోసీ పొందితే సమ్మక్క సాగర్ నుంచి అనేక ప్రయోజనాలు పొందవచ్చని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది.

మణుగూరులో వరుస ప్రకంపనలు

మొదటిపేజీ తరువాయి - వివరాల ప్రకారం.. మల్లేపల్లి ఓపెన్ కాస్ట్ గని సమీపంలో ఉదయం 11:28 గంటల సమయంలో మొదటిసారి ప్రకంపనలు వచ్చాయి. ఆ తర్వాత కొద్దిసేపటికే, అంటే 11:40 గంటల ప్రాంతంలో మరోసారి భూమి కంపించింది. మణుగూరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలైన రాజుపేట, విఠల్‌రావు నగర్, పీకే-1, బాపనకుంట, కొత్త కొండాపురంలలో ఈ ప్రకంపనల ప్రభావం స్పష్టంగా కనిపించింది. ముఖ్యంగా భూగర్భ గనులకు సమీపంలో ఉండే శివలింగపురంలో వరుసగా మూడుసార్లు భారీ శబ్దాలు వినిపించాయని, ఇళ్ల పైకప్పులు కూడా తీవ్రంగా కంపించాయని స్థానికులు చెబుతున్నారు.సాధారణంగా సింగరేణి కాలరీస్ పరిధిలోని ఓపెన్ కాస్ట్ గనుల్లో బ్లాస్టింగ్ ప్రక్రియ ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో జరుగుతుంటుంది. ఆ సమయంలో వచ్చే ప్రకంపనలు, శబ్దాలకు స్థానికులు అలవాటు



పడ్డారు. అయితే, మంగళవారం ఉదయం వేళల్లోనే ఈ భారీ శబ్దాలు రావడం, భూమి కంపించడంతో ఇది సింగరేణి బ్లాస్టింగా లేక సహజంగా సంభవించిన భూకంపమా అనే దానిపై ప్రజల్లో తీవ్ర అయోమయం నెలకొంది.ఈ ప్రకంపనల తీవ్రత, భూకంప కేంద్రానికి సంబంధించి అధికారిక సమాచారం ఇంకా వెలువడలేదు. మణుగూరు పరిసరాల్లో స్థానికంగా రిక్టర్ స్కేలు కొలిచే వ్యవస్థలు అందుబాటులో లేవు. మరోవైపు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ (ఎన్‌జీఆర్) అధికారిక పోర్టల్‌లో కూడా సాయంత్రం వరకు ఈ ప్రకంపనలకు సంబంధించిన డేటా నమోదు కాలేదు.భౌగోళికంగా గోదావరి లోయ పరివాహక ప్రాంతాల్లోని ప్రాచీన ఫాల్ట్ లైన్స్ కారణంగా అప్పుడప్పుడు స్వల్ప ప్రకంపనలు నమోదు కావడం సహజమేనని నిపుణులు చెబుతుంటారు. గతంలో 2026 జూన్ నెలలో కూడా మణుగూరు పరిసరాల్లో 3.8 తీవ్రతతో భూకంపం నమోదైంది. ప్రస్తుత ఘటనపై స్పష్టత కోసం స్థానిక ప్రజలు సింగరేణి యాజమాన్యంతో పాటు జిల్లా అధికార యంత్రాంగం, సిస్మాలజీ విభాగం నుంచి వచ్చే అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.

హైదరాబాద్‌లో రోడ్ల పండుగ

మొదటిపేజీ తరువాయి - నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమానికి దేశ, విదేశాల నుంచి 3,000 మందికి పైగా రోడ్ ఇంజినీర్లు, అధికారులు, మౌలిక సదుపాయాల నిపుణులు హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈ సదస్సును ప్రారంభించనుండగా, కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కూడా ప్రసంగిస్తారు.ఈ భారీ కార్యక్రమానికి ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సోమవారం తెలిపారు. హైటెక్స్‌లో జరిగే ఈ సదస్సులో భాగంగా దాదాపు 400 ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. "హైదరాబాద్‌కు వచ్చే అతిథులను ఎంతో ఆత్మీయంగా స్వాగతిస్తాం. ఈ సదస్సుకు హాజరయ్యే ప్రతి ప్రతినిధికి గొప్ప అనుభూతిని పంచాలనుకుంటున్నాం. 'రైజింగ్ తెలంగాణ' కింద, బలమైన సాంస్కృతిక మూలాలున్న ఒక ఆధునిక రాష్ట్రం భవిష్యత్ రహదారులను ఎలా నిర్మిస్తోందో గర్వంగా ప్రపంచానికి చూపిస్తాం" అని మంత్రి కోమటిరెడ్డి వివరించారు.ఈ సదస్సులో భాగంగా ఏర్పాటు చేసే టెక్నికల్ ఎగ్జిబిషన్‌ను నవంబర్ 18న ప్రారంభించనున్నారు. రాష్ట్ర సాంస్కృతిక వారసత్వం, కీలకమైన మౌలిక సదుపాయాలు, రోడ్డు ప్రాజెక్టులను ప్రదర్శించేందుకు ప్రత్యేకంగా 'రామప్ప టెంపుల్ పెవిలియన్' ఏర్పాటు చేయడం విశేషం. ప్రతినిధుల కోసం వసతి, రవాణా, ఆతిథ్యం విషయంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. వారికి హైదరాబాదీ వంటకాల రుచులను అందించడంతో పాటు, సాయంత్రం వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నారు. సదస్సు ముగిసిన తర్వాత నవంబర్ 22న ప్రతినిధుల కోసం ప్రత్యేక పర్యటనలు ఏర్పాటు చేశారు.1934లో ఏర్పాటైన ఇండియన్ రోడ్ కాంగ్రెస్,



దేశంలోని హైవే ఇంజినీర్ల అత్యున్నత సంస్థ. రోడ్లు, వంతెనల ప్రణాళిక, నిర్మాణం, నిర్వహణకు సంబంధించిన ప్రమాణాలు, మార్గదర్శకాలను అభివృద్ధి చేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది.

కెరీర్‌లో ఇది మంచి అవకాశం

మొదటిపేజీ తరువాయి - ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఇటీవల ప్రకటించిన భారీ వాలంటరీ ఎగ్జిట్ (స్వచ్ఛంద నిష్క్రమణ) ప్యాకేజీల వెనుక ఉన్న అసలు కారణాలను సంస్థ సీఈవో సత్య నాదెళ్ల స్పష్టం చేశారు. ఓ పాడ్‌కాస్ట్‌లో ఆయన మాట్లాడుతూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో వస్తున్న పెను మార్పుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఉద్యోగులు తమ కెరీర్‌పై పూర్తి నియంత్రణ కలిగి ఉండేందుకే ఈ ప్యాకేజీలను ఆఫర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.మైక్రోసాఫ్ట్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ వర్క్‌ఫోర్స్‌లో సుమారు 27 శాతం మందికి, అంటే దాదాపు 60 వేల మంది ఉద్యోగులకు ఈ స్వచ్ఛంద విరమణ ఆప్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. భారత్, అమెరికా, కెనడా, బ్రిటన్ దేశాల్లోని ఉద్యోగులకు ఈ ప్యాకేజీలను అందించారు. సాంకేతిక రంగంలో వస్తున్న వేగవంతమైన మార్పులకు అనుగుణంగా సంస్థను తీర్చిదిద్దే క్రమంలోనే ఈ నిర్ణయం అమల్లోకి వచ్చింది.ఈ అంశంపై సత్య నాదెళ్ల సుదీర్ఘంగా వివరణ ఇచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విస్తృతితో ఉద్యోగాలు చేసే విధానం, సంస్థలో అవసరమైన సిబ్బంది సంఖ్య పూర్తిగా మారుతున్నాయని ఆయన తెలిపారు. భవిష్యత్తులో కొత్త ఉద్యోగావకాశాలు వచ్చినప్పటికీ, వాటి స్వభావం ఇప్పటికంటే భిన్నంగా ఉంటుందని వివరించారు. మైక్రోసాఫ్ట్ లోపల అయినా, వెలుపల అయినా ఉద్యోగులు కొత్త నైపుణ్యాలను నేర్చుకుని ఎదిగేలా ప్రోత్సహించడమే కంపెనీ ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.సంస్థలో ఎలాంటి మార్పు లేకుండా ఒకే స్థాయి లేదా ఒకే రోల్‌లో ఆగిపోయామని భావించే ఉద్యోగులకు స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే అవకాశం కల్పించడానికే ఈ ఎగ్జిట్ ఆఫర్లను తెచ్చినట్లు సత్య నాదెళ్ల స్పష్టం చేశారు. సంస్థ వెలుపల తమ భవిష్యత్తును వెతుక్కోవాలనుకునే



వారికి ఈ ప్యాకేజీలు ఆర్థికంగా అండగా నిలుస్తాయని తెలిపారు. ఒక సాధారణ ఉద్యోగిగా కెరీర్ ప్రారంభించి సీఈవో స్థాయికి చేరిన విషయాన్ని గుర్తుచేసుకుంటూ, ఎదుగుదల లేకుండా ఒకే పాత్రలో స్థిరపడిపోవడాన్ని తాను వ్యక్తిగతంగా కూడా ఇష్టపడనని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, సంస్థలోనే కొనసాగే ఉద్యోగులకు భవిష్యత్తులో మెరుగైన, సరికొత్త అవకాశాలను సృష్టించేందుకు కూడా ఈ ప్రక్రియ దోహదపడుతుందని కంపెనీ భావిస్తోంది. ప్రస్తుతం

శ్రీనివాసపురం పెద్దమ్మ గుడి

హుండీ ఆదాయం రూ.2,34,020

ఉగాది నుంచి దసరా వరకు వచ్చిన ఆదాయం లెక్కింపు



తాడిపత్రి , నవంబర్ 17 అక్షర మేధస్సు తాడిపత్రి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ జేసీ అస్మిత్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు శ్రీనివాసపురం పాలిమేరలోని పెద్దమ్మ దేవాలయ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు నిర్వహించారు. ఉగాది పండుగ నుంచి దసరా పండుగ వరకు భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకలను హుండీ నుంచి వెలికితీసి కమిటీ సభ్యుల సమక్షంలో లెక్కించారు. ఈ లెక్కింపులో మొత్తం రూ.2,34,020 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి, అమ్మవారి సేవా కార్యక్రమాలకు భక్తులు అందిస్తున్న సహకారం అభినందనీయమని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లయ్య స్వామి (బుజ్జయ్య), బలిజ సంఘం అధ్యక్షుడు ప్రసాద్, దబ్బర బాబు, మురుగన్ బాలు, కత్తి రామాంజులు రెడ్డి, నరేంద్ర, నాగేష్ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల మహిళా

క్రీడా పోటీల్లో ఉత్కంఠభరిత పోరు

టేబుల్ టెన్నిస్‌లో కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు విజయం

గుంతకల్ నవంబర్ 17 అక్షర మేధస్సు ప్రతినిధి గుమ్మనూరు హరి అంతర్ కళాశాలల మహిళా క్రీడా పోటీల్లో భాగంగా నిర్వహించిన వివిధ క్రీడా విభాగాల్లో కళాశాలల జట్లు ప్రతిభ కనబరుస్తూ విజయాల కోసం హోరాహోరీగా తలపడాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఖోఖో పోటీల్లో గుంతకల్ ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల జట్టు, అనంతపురం ఆర్ట్స్ కళాశాల జట్టు ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. కబడ్డీ పోటీల్లో గుంతకల్ ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల జట్టు, అనంతపురం ఎస్కేయూ జట్టు ఫైనల్స్‌లో ప్రవేశించాయి. అదేవిధంగా వాలీబాల్ పోటీల్లో అనంతపురం ఎస్కేయూనివర్సిటీ జట్టు, అనంతపురం శ్రీవాణి డిగ్రీ కళాశాల జట్టు సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. వివిధ కళాశాలలకు చెందిన క్రీడాకారిణులు ఉత్సాహంగా పాల్గొంటూ తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. పోటీల్లో విజయం సాధించిన జట్లను నిర్వాహకులు అభినందించారు.

కోవిడ్ సమయంలో రద్దయిన జర్నలిస్టుల

రైల్వే పాసులను పునరుద్ధరించాలి

డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాకు జర్నలిస్టుల వినతి

సమస్య పరిష్కారానికి సానుకూల హామీ



తాడిపత్రి నవంబర్ 17 అక్షర మేధస్సు కోవిడ్ సమయంలో రద్దు చేసిన జర్నలిస్టుల రైల్వే పాసులను తిరిగి పునరుద్ధరించాలని తాడిపత్రి జర్నలిస్టులు గుంతకల్ రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్ఎం) చంద్రశేఖర్ గుప్తాను కోరారు. రైల్వే మాక్ డ్రిల్ కార్యక్రమం నిమిత్తం సోమవారం తాడిపత్రికి వచ్చిన డీఆర్ఎంను జర్నలిస్టులు కలిసి ఈ సమస్యపై వినతిపత్రం అందజేసి చర్చించారు. కరోనా మహమ్మారి సమయంలో రద్దు చేసిన జర్నలిస్టుల రైల్వే పాసులను ఇప్పటివరకు పునరుద్ధరించకపోవడంతో జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టులు తమ వృత్తి నిర్వహణలో భాగంగా వివిధ ప్రాంతాలకు నిరంతరం ప్రయాణించాల్సి ఉంటుందని, వార్తా సేకరణ, ప్రజా సమస్యల వెలుగులోకి తీసుకురావడంలో రైల్వే ప్రయాణం ఎంతో అవసరమని వివరించారు. గతంలో అమలులో ఉన్న విధంగా జర్నలిస్టుల రైల్వే పాసులను పునరుద్ధరించడంతో పాటు రెన్యూవల్ ప్రక్రియను సులభతరం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా సానుకూలంగా స్పందిస్తూ, జర్నలిస్టుల సమస్యను పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో కోవిడ్ సమయంలో నిలిచిపోయిన జర్నలిస్టుల రైల్వే పాసుల పునరుద్ధరణపై ఆశలు చిగురించాయి.

సర్పంచ్ ఎన్నికల నామినేషన్ల

సందర్భంగా శాంతిభద్రతలకు సహకరించాలి



గుత్తి, నవంబర్ 17 అక్షర మేధస్సు ప్రతినిధి ఆదినారాయణ గుత్తి మండల పరిధిలో గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని గుత్తి సీఐ. ధరణి కిషోర్ , విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ నెల 18, 19, 20 తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు నిర్ణీత సమయంలో సంబంధిత రిటర్నింగ్ అధికారులకు నామినేషన్లు సమర్పించాలని సూచించారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో అభ్యర్థితో పాటు మరో ఇద్దరికి మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతి ఉంటుందని, అంటే మొత్తం ముగ్గురికి మాత్రమే ప్రవేశం ఉంటుందని స్పష్టం చేశారు. అభ్యర్థి స్వయంగా హాజరుకాని పక్షంలో ప్రతిపాదకుడితో పాటు మరో ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలోనే వాహనాలను నిలిపివేయాలని సూచించారు. అభ్యర్థులు తమ అనుచరులతో ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించడం, గుంపులుగా చేరడం, నినాదాలు చేస్తూ ఇతరులకు ఇబ్బందులు కలిగించడం నిషేధమని పేర్కొన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద వాగ్వాదాలు, ఘర్షణలు, బెదిరింపులు, పరస్పర దూషణలకు పాల్పడరాదని, ఇతర అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలిగించకూడదని హెచ్చరించారు. మారణాయుధాలు, ప్రమాదకర వస్తువులను వెంట తీసుకురావడం, మద్యం సేవించి కేంద్రాల వద్దకు రావడం పూర్తిగా నిషేధమన్నారు. ఎన్నికలకు సంబంధించి సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలు, వదంతులను నమ్మవద్దని, వాటిని ఇతరులకు పంపవద్దని సూచించారు. ఏదైనా సమస్య లేదా అవాంఛనీయ సంఘటన చోటుచేసుకుంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కావున సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సంయమనం పాటిస్తూ పోలీసులకు సహకరించాలని గుత్తి సీఐ ధరణి కిషోర్. విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని గుత్తి పోలీస్ శాఖ హెచ్చరించింది.

బాల్యవివాహాల నివారణపై విద్యార్థులకు అవగాహన



పామిడి నవంబర్ 17 అక్షర మేధస్సు పామిడిలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు బాల్యవివాహాల నిషేధ చట్టం, ఆడపిల్లల ప్రాముఖ్యత, లింగ వివక్షత, మహిళలు, పిల్లల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బేతాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన డిప్యూటీ హెచ్ఈఓ సి. వెంకటేష్ ఈ సందర్భంగా మాట్లాడారు. లింగ వివక్షత మహిళల అభివృద్ధికి, సాధికారతకు అడ్డంకిగా మారుతోందన్నారు. చిన్న వయసులోనే బాలికలు గర్భం దాల్చడం వల్ల వారి శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. బాల్యవివాహాలతో శిశు మరణాలు, మాతృ మరణాల ముప్పు పెరుగుతుందని వివరించారు. ఆడపిల్లలకు సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. విద్య ద్వారా మహిళలను ప్రోత్సహిస్తే లింగ వివక్షత, బాల్యవివాహాలు వంటి సామాజిక రుగ్మతలను అరికట్టవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ బాల్యవివాహాల నివారణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ టి. శ్రీరామిరెడ్డి, బాపూజీ నాయక్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు ప్రాచీన, ఆధునిక కవులపై ప్రత్యేక సదస్సు

పెద్దవడుగూరు, నవంబర్ 17 అక్షర మేధస్సు 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పెద్దవడుగూరు శాఖా గ్రంథాలయంలో మంగళవారం తెలుగు ప్రాచీన, ఆధునిక కవుల సాహిత్య సేవలు, వారి రచనా శైలిపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కవుల గొప్పతనం, తెలుగు సాహిత్యానికి వారు అందించిన విశేష సేవలను వివరించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు జి. ఈశ్వరప్ప, గ్రామ పెద్దలు బి. నారాయణ, కె. చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు జి. ఈశ్వరప్ప మాట్లాడుతూ తెలుగు సాహిత్య చరిత్రలో నన్నయ్య, తిక్కన, ఎర్రప్రగడ, పోతన వంటి ప్రాచీన కవులు విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. ఆధునిక కవులలో గుర్రం జాషువా, శ్రీశ్రీ వంటి మహాకవులు తమదైన రచనా శైలితో తెలుగు సాహిత్యానికి విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. ప్రతి కవికి ప్రత్యేకమైన రచనా శైలి ఉంటుందని, నన్నయ్య, తిక్కన, ఎర్రప్రగడ మహాభారతాన్ని తెలుగులోకి అనువదించి ఆంధ్ర మహాభారతానికి విశేష కృషి చేశారని వివరించారు. అదేవిధంగా బమ్మెర పోతన



శ్రీమదాంధ్ర మహాభాగవతాన్ని తెలుగులో రచించి తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. గ్రంథాలయాధికారి పి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజ కవులు తెలుగు సాహిత్యానికి ఎనలేని కీర్తిని తీసుకొచ్చారని అన్నారు. అల్లసాని పెద్దన, నంది తిమ్మన, ధూర్జటి, తెనాలి రామకృష్ణ, పింగళి సూరన వంటి కవుల రచనలు తెలుగు సాహిత్యంలో ప్రత్యేక గుర్తింపు పొందాయని వివరించారు. నేటి యువత, విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని, తెలుగు కవిత్వం, సాహిత్యంపై మక్కువ పెంపొందించుకోవాలని సూచించారు. తెలుగు భాషా సాహిత్య వైభవాన్ని భావితరాలకు పరిచయం చేయడంలో గ్రంథాలయాల పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పి. వెంకటేశ్వర్లు, గ్రంథాలయ పాఠకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చిన్నవడుగూరు గ్రామ ప్రజల తాగునీటి కష్టాలకు చెక్..

రూ.20 వేల సొంత ఖర్చుతో స్టెబిలైజర్ ఏర్పాటు చేసిన చిన్న వడగూరు దివాకర్ రెడ్డిని గ్రామ ప్రజల విజ్ఞప్తికి తక్షణ స్పందన.. సమస్య పరిష్కారానికి ముందడుగులి



పెద్దవడుగూరు, నవంబర్ 17 అక్షర మేధస్సు ప్రతినిధి రంగనాథ్ పెద్దవడుగూరు మండలం చిన్నవడుగూరు గ్రామంలో తాగునీటి సరఫరాకు సంబంధించిన మోటార్లు తరచూ కాలిపోతుండటంతో గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన చిన్న వడగూరు దివాకర్ రెడ్డి మానవతా దృక్పథంతో స్పందించి సమస్య పరిష్కారానికి ముందుకు వచ్చారు. గ్రామంలో విద్యుత్ సరఫరాలో తరచూ హెచ్చుతగ్గులు ఏర్పడుతుండటంతో తాగునీటి సరఫరా మోటార్లు కాలిపోతున్నాయని, దీంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు దివాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న ఆయన మోటార్లు పదేపదే కాలిపోకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా తన సొంత ఖర్చులతో సుమారు రూ.20 వేల వ్యయంతో స్టెబిలైజర్‌ను తెప్పించి గ్రామంలో ఏర్పాటు చేయించారు. విద్యుత్ వోల్టేజీలో హెచ్చుతగ్గులు వచ్చినప్పుడు మోటార్లకు రక్షణ కల్పించేందుకు ఈ స్టెబిలైజర్ ఉపయోగపడనుంది. తద్వారా మోటార్లు దెబ్బతినకుండా ఉండటంతో పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం తగ్గుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ప్రజా సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఉంటాయని, అయితే తమ గ్రామంలో తాగునీటి సమస్యను తెలుసుకున్న వెంటనే దివాకర్ రెడ్డి స్పందించి తన సొంత డబ్బులతో రూ.20 వేల విలువైన స్టెబిలైజర్ ఏర్పాటు చేయించడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడమే నిజమైన సేవకు నిదర్శనమని గ్రామ ప్రజలు దివాకర్ రెడ్డి చేసిన సహకారాన్ని ప్రశంసిస్తూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో తాగునీటి సరఫరా సక్రమంగా కొనసాగాలని, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్న సత్యసాయి జిల్లా కలెక్టర్

కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి సేవలో పాల్గొన్న కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఐఏఎస్

గుంతకల్, నవంబర్ 17 అక్షర మేధస్సు ప్రతినిధి గుమ్మనూరు





హరి. గుంతకల్ పట్టణ సమీపంలోని కసాపురం గ్రామంలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి వారిని సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఐఏఎస్ మంగళవారం తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు ఆలయ సంప్రదాయాల ప్రకారం ఘన స్వాగతం పలికారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మేడేపల్లి విజయరాజు, ప్రధాన అర్చకులు కే. రాఘవాచార్యులు, వేద పండితులు, అర్చకులు కలెక్టర్ కుటుంబ సభ్యులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ కుటుంబ సభ్యులకు నెట్టికంటి ఆంజనేయస్వామి వారి దర్శన భాగ్యం కల్పించారు. దర్శనానంతరం యాగశాలలో వేద పండితులు ప్రత్యేక వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను కలెక్టర్‌కు, ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. పవిత్రమైన కసాపురం క్షేత్రంలో స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా కలెక్టర్ కుటుంబ సభ్యులు భక్తిభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేద పండితులు, కసాపురం గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎక్సైజ్ సీఐ శివసాగర్

గుంతకల్, నవంబర్ 17 అక్షర మేధస్సు ప్రతినిధి గుమ్మనూరు హరి గుంతకల్ పట్టణంలోని ఎస్.కే.పి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశాల మేరకు కళాశాల ఎన్ఎస్ఎస్, ఈగిల్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ



కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ. లక్ష్మయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మాదకద్రవ్య



రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకొని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గుంతకల్ ఎక్సైజ్ సీఐ జి. శివసాగర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా కుటుంబ వ్యవస్థ కూడా చిన్నాభిన్నమవుతుందని హెచ్చరించారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా విద్యపై పూర్తి ఏకాగ్రత చూపాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు, చదువుకున్న కళాశాలకు, సొంత గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే ఎక్సైజ్ ఎస్ఐలు సుశీలమ్మ, జి. శ్రీరామ్ మూర్తి పాల్గొని మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, వాటి వినియోగం నుంచి దూరంగా ఉండాల్సిన ఆవశ్యకతపై విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్. రవిశంకర్ శర్మ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. కె. హనుమంతరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు నీలం నారాయణ, డా. కె. రవిశంకర్, ఎస్ఏఎస్ఏ కోఆర్డినేటర్ ఎన్.ఎ. అల్తాఫ్, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకుంటామని, సమాజంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు తమ వంతు బాధ్యతగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. యువతలో చైతన్యం కల్పిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో అంతర్ కళాశాలల మహిళా క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభం

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి -- ఎస్కేయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్

గుంతకల్, నవంబర్ 17 అక్షర మేధస్సు ప్రతినిధి గుమ్మనూరు హరి గుంతకల్ పట్టణంలోని శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల వేదికగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్ కళాశాలల మహిళా క్రీడా పోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, అనంతరం జాతీయ పతాకం, క్రీడా పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్రీడాకారిణులు అతిథులకు గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లోనూ ఆసక్తి పెంచుకొని ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు. క్రీడలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి శక్తివంతమైన సాధనాలని పేర్కొన్నారు. క్రీడల వల్ల శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. క్రీడలను జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆకాంక్షించారు. కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్ మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలనే లక్ష్యంతో ముందుకు సాగే ప్రతి



విద్యార్థినికి విద్యతోపాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. క్రీడా పోటీలు విద్యార్థుల్లో పోటీతత్వం, ఐక్యత, క్రమశిక్షణను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డీఏ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వెంకటేశ్వర్లు, యూనివర్సిటీ స్పోర్ట్స్ సెక్రటరీ ఎన్.వి. శ్రీనివాసన్, కళాశాల ట్రెజరర్ బండారు అశ్వర్థమ్మ, విశ్రాంత ప్రిన్సిపాళ్లు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎంసీ బాలయ్య, కే. రామకృష్ణ నాయుడు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మహమ్మద్ భాషా, వివిధ కళాశాలల నుంచి విచ్చేసిన క్రీడాకారిణులు, అధ్యాపకులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళా క్రీడాకారిణుల్లో ఉత్సాహాన్ని నింపిన ఈ ప్రారంభోత్సవం కళాశాల ప్రాంగణంలో క్రీడా సందడిని నెలకొల్పింది.

ఏపీలో ముగిసిన రెండో దశ నామినేషన్ల ఘట్టం

బరిలో 7,508 మంది అభ్యర్థులు

రాష్ట్రంలో రెండోదశ మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగిసింది

23 పట్టణ స్థానిక సంస్థలకు ఏకంగా 7,508 నామినేషన్లు దాఖలయ్యాయి

నేడు నామినేషన్ల పరిశీలన జరగనుంది



రెండోదశ మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. 23 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల బరిలో నిలిచేందుకు అభ్యర్థులు భారీగా నామినేషన్లు దాఖలు చేశారు. మూడు రోజుల్లో మొత్తం 7 వేల 508 నామినేషన్లు వచ్చాయి. చివరిరోజు కాకినాడలో భారీగా నామినేషన్లు దాఖలు కాగా, ఆమదాలవలస, తణుకు, శ్రీకాళహస్తిలోనూ రాజకీయ సందడి కనిపించింది. మరోవైపు నరసరావుపేటలో నామినేషన్ పత్రాల వ్యవహారం ఉద్రిక్తతకు దారితీసింది.రెండో దశలో నిర్వహిస్తున్న 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మూడు రోజుల్లో మొత్తం 7 వేల 508 నామినేషన్లు దాఖలయ్యాయి. మేయర్, ఛైర్‌పర్సన్ స్థానాలకు 385, డివిజన్లు, వార్డులకు 7 వేల 123 నామినేషన్లు వేశారు. చివరి రోజైన సోమవారం నగరపాలక సంస్థల్లో మేయర్, డివిజన్ స్థానాలకు 1984, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ఛైర్‌పర్సన్, వార్డులకు 3,746 నామినేషన్లు దాఖలయ్యాయి. శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, కాకినాడ, మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థలతోపాటు 19 పురపాలక సంఘాలు, నగర పంచాయతీలకు, నంద్యాల జిల్లా ఆత్మకూరులో 20వ వార్డుకు శనివారం ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సోమవారంతో ముగిసింది. అధికారులు ఇవాళ నామినేషన్లను పరిశీలించి సరైన పత్రాలు జత చేయనివి తిరస్కరించనున్నారు. 19న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను అధికారులు ప్రకటిస్తారు.ఒక్కరోజే 114 నామినేషన్ పత్రాలు : శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస పురపాలక సంఘంలో ఛైర్‌పర్సన్, 28 వార్డు కౌన్సిలర్ స్థానాలకు కలిపి మొత్తం 154 నామినేషన్లు దాఖలైనట్లు సహాయ ఎన్నికల అధికారి, పురపాలక కమిషనర్ స్పష్టం చేశారు. సోమవారం ఒక్కరోజే 114 నామినేషన్ పత్రాలు అందాయి. కౌన్సిలర్ స్థానాలకు అందిన వాటిలో టీడీపీ తరఫున 62, వైఎస్సార్సీపీ నుంచి 60, జనసేన తరఫున 13, బీజేపీ నుంచి 5, స్వతంత్ర అభ్యర్థులుగా 8 నామినేషన్లు దాఖలయ్యాయని వివరించారు.కాకినాడ నగరపాలక సంస్థలో చివరిరోజు అభ్యర్థుల భారీగా నామినేషన్లు దాఖలు చేశారు. మేయర్ పదవికి 28 నామినేషన్లు రాగా, 66 కార్పొరేటర్ స్థానాలకు ఏకంగా 840 నామినేషన్లు దాఖలయ్యాయి. సోమవారం ఒక్కరోజే 629 నామినేషన్లు వచ్చాయి. మేయర్ పదవికి జనసేన నుంచి అత్యధికంగా 11 వచ్చాయి. వైఎస్సార్సీపీ నుంచి 5, తెలుగుదేశం, కాంగ్రెస్ నుంచి రెండేసి, దీప్రా నుంచి ఒకటి, ఇతర పార్టీల నుంచి రెండు, స్వతంత్ర అభ్యర్థులుగా ఐదుగురు నామినేషన్లు వేశారు. కార్పొరేటర్ స్థానాలకు టీడీపీ నుంచి అత్యధికంగా 282 నామినేషన్లు రాగా, వైఎస్సార్సీపీ నుంచి 202, స్వతంత్రుల నుంచి 154, జనసేన నుంచి 146, బీజేపీ నుంచి 44 నామినేషన్లు వచ్చాయి.పశ్చిమగోదావరి జిల్లా తణుకులో తొలిరెండు రోజులు ఛైర్‌పర్సన్ పదవికి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాకపోగా, చివరిరోజు 8 నామినేషన్లు వచ్చాయి. పాలకొల్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ టీడీపీ అభ్యర్థి ఉషారాణి, కౌన్సిలర్ అభ్యర్థులను బలపరుస్తూ మంత్రి నిమ్మల రామానాయుడు బైక్ ర్యాలీతో వెళ్లి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పురపాలక సంఘం ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. 44 వార్డులకు ఛైర్మన్ అభ్యర్థిత్వానికి 19 నామినేషన్లు, కౌన్సిలర్లకు సంబంధించి 316 నామినేషన్లు దాఖలయ్యాయి.

పదేళ్ల సర్వీసులో జీతం రూ.70 లక్షలు.. కూడబెట్టిన ఆస్తులు మాత్రం రూ.30 కోట్లు!

మొయినాబాద్ టీపీఓ గుండు వాణిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు

పదేళ్ల సర్వీసులో సంపాదించిన అధికారిక వేతనం రూ. 70 లక్షలు మాత్రమే

మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ. 30 కోట్ల అక్రమాస్తులు గుర్తించిన ఏసీబీ

అక్రమ సంపాదనను కుటుంబ వ్యాపారాలు షేర్ మార్కెట్లలోకి మళ్లించినట్లు వెల్లడి

ఎనిమిది ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి స్థిర చరాస్తులను సీజ్ చేసిన అధికారులు





రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ టౌన్ ప్లానింగ్ అధికారిణి (టీపీఓ) గుండు వాణిపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసింది. పదేళ్ల సర్వీసులో ఆమె అధికారిక వేతనం రూ. 70 లక్షలు కాగా, బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ. 30 కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు.జీ+3 భవన నిర్మాణ అనుమతుల మంజూరు కోసం మొయినాబాద్‌కు చెందిన మహ్మద్ ఖమర్ నుంచి రూ. 75 వేలు లంచం తీసుకుంటూ సెప్టెంబర్ 30న మాజీ పంచాయతీ కార్యదర్శి ఎలమోని సుదర్శన్‌తో కలిసి ఆమె ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు. ప్రస్తుతం చంచల్‌గూడ మహిళా జైలు రిమాండ్‌లో ఉన్న ఆమెపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసిన అధికారులు, నిర్వహించిన సోదాల్లో కళ్లు చెదిరే ఆస్తులను గుర్తించారు.హైదరాబాద్ ఆసిఫ్ నగర్‌కు చెందిన గుండు వాణి 2016లో టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సీర్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. అనంతరం సూపర్‌వైజర్, టీపీఓగా పదోన్నతులు పొందారు. వికారాబాద్ మున్సిపాలిటీతో పాటు మొయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి మున్సిపాలిటీల అదనపు బాధ్యతలు నిర్వహించిన సమయంలో భవనాల విస్తీర్ణం, ఫ్లోర్ల సంఖ్యను బట్టి భారీగా లంచాలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.పదేళ్లలో ఆమె సంపాదించిన అధికారిక వేతనం రూ.70 లక్షలు కాగా, ప్రభుత్వ లెక్కల ప్రకారమే రూ. 6.76 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను కూడబెట్టారు. ఈ ఆస్తుల మార్కెట్ విలువ రూ.30 కోట్ల వరకు ఉంటుందని ఏసీబీ అధికారులు తేల్చారు.లంచాల రూపంలో వచ్చిన అక్రమ సొమ్మును కూతురి పేరిట నెలకొల్పిన రియల్ ఎస్టేట్ సంస్థ ద్వారా ఆమె భర్త వ్యాపారంలోకి మళ్లించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అత్తాపూర్, జడ్చర్ల, జనగామ సహా ఎనిమిది ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు నిర్వహించింది. అత్తాపూర్‌లో రూ. 63 లక్షల ఫ్లాట్, రూ. 2.45 కోట్ల విలువైన జీ+2 భవనం, మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండలో 1.10 ఎకరాల వ్యవసాయ భూమి, జడ్చర్ల, పాలకుర్తిలలో ఓపెన్ ప్లాట్లను గుర్తించారు. వీటితో పాటు మహబూబ్‌నగర్‌లోని తుల్జా భవానీ వైన్స్‌లో రూ. 50 లక్షలు, షేర్ మార్కెట్‌లో రూ.1.30 కోట్ల పెట్టుబడులు ఉన్నట్లు తేలింది. రూ. 5.47 లక్షల నగదు, బ్యాంకుల్లో రూ. 7.97 లక్షల డిపాజిట్లు, 175 గ్రాముల బంగారం, మహీంద్రా ఎక్స్‌యూవీ 700, హ్యుందాయ్ క్రెటా కార్లు, రెండు ద్విచక్ర వాహనాలను అధికారులు సీజ్ చేశారు.

అవినీతికి పాల్పడితే వేటే

అవినీతి, అక్రమాలకు పాల్పడే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవన్న కొత్త సీపీ

అవినీతి, అక్రమ నిర్బంధాలపై జీరో టాలరెన్స్ విధానం ప్రకటన

మహిళలు, వృద్ధుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశం

పోలీసులు క్షేత్రస్థాయిలో ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచన

నేరాల నియంత్రణకు విడుదలైన ఖైదీలపై ప్రత్యేక నిఘా వ్యవస్థ



హైదరాబాద్ నూతన పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన మహేశ్ మురళీధర్ భగవత్, పోలీస్ శాఖలో ప్రక్షాళనకు నడుం బిగించారు. అవినీతి, అక్రమాలకు పాల్పడే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని గట్టి హెచ్చరికలు జారీ చేశారు. శాఖాపరమైన చర్యలతో పాటు, నేరం తీవ్రతను బట్టి క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఇటీవల కొందరు పోలీసు అధికారులు లంచం, బెదిరింపుల కేసుల్లో చిక్కుకున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.అవినీతి, అక్రమ నిర్బంధాలు, భూవివాదాలు వంటి సివిల్ అంశాలలో పోలీసుల జోక్యంపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని అనుసరిస్తామని మహేశ్ భగవత్ తెలిపారు. తమ స్పెషల్ బ్రాంచ్ బృందాలు ఇలాంటి కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచుతాయని చెప్పారు. ఎవరైనా అధికారి తప్పుగా ప్రవర్తిస్తే, బాధితులు నేరుగా జోనల్ హెడ్స్‌కు ఫిర్యాదు చేయవచ్చని, ఆరోపణలు రుజువైతే సంబంధిత అధికారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఇటీవల అన్ని జోన్ల ఉన్నతాధికారులు, ఎస్‌హెచ్‌వోలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు ఇచ్చారు. వృద్ధులు, మహిళలు, చిన్నారుల భద్రత, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పోలీసులు 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అవినీతి, అత్యాచారం, బెదిరింపుల ఆరోపణలపై ఏసీబీకి చిక్కిన పోలీసు సిబ్బంది రికార్డులను కూడా ఆయన సమీక్షించినట్లు ఓ సీనియర్ అధికారి తెలిపారు.పోలీసులు స్టేషన్లకే పరిమితం కాకుండా, తమ పరిధిలోని ప్రాంతాల్లో నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని భగవత్ ఆదేశించారు. ముఖ్యంగా సాయంత్రం నుంచి రాత్రి వరకు సున్నితమైన ప్రాంతాల్లో గస్తీని బలోపేతం చేయాలని సూచించారు. ఉదయం పూట గస్తీ పనితీరును సమీక్షించి, ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని పెట్రోలింగ్ పెంచాల్సిన ప్రాంతాలను గుర్తించాలని తెలిపారు.ఇటీవల కమిషనరేట్ పరిధి శంషాబాద్, రాజేంద్రనగర్ వరకు విస్తరించడంతో బాధ్యతలు కూడా పెరిగాయని, సిబ్బంది కొరతను అధిగమించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని సీపీ పేర్కొన్నారు. వ్యవస్థీకృత నేరాలు, ముఠా కక్షలను నివారించేందుకు త్వరలోనే 'ప్రిజనర్-రిలీజ్ మానిటరింగ్ మెకానిజం'ను ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. విడుదలైన ఖైదీల సమాచారాన్ని వ్యవస్థలతో అనుసంధానం చేసి వారిపై నిఘా ఉంచుతామన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, పెండింగ్ చలాన్ల క్లియరెన్స్ ప్రక్రియను సులభతరం చేయడంపై కూడా ట్రాఫిక్ అధికారులతో ఆయన చర్చించారు. తనకు ఈ బాధ్యత అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన భగవత్, అన్ని విభాగాల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని పోలీసింగ్‌ను మరింత మెరుగుపరుస్తానని హామీ ఇచ్చారు.

ఆన్‌లైన్ ఫార్మసీలపై 'టీజీ సేఫ్' కొరడా.. 23 మెడికల్ షాపుల లైసెన్సుల సస్పెన్షన్

నిబంధనలు ఉల్లంఘించినందుకు చర్యలు తీసుకున్న 'టీజీ సేఫ్'

టాటా 1ఎంజీ, నెట్‌మెడ్స్, అపోలో వంటి సంస్థల భాగస్వామ్య షాపులపై తనిఖీలు

మరో 9 మెడికల్ షాపులకు హెచ్చరికలు జారీ చేసిన అధికారులు

అక్రమ అమ్మకాలపై ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు

తెలంగాణలో ఆన్‌లైన్ మెడిసిన్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లతో అనుసంధానమై పనిచేస్తున్న 23 మెడికల్ షాపులపై అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. చట్టపరమైన నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను వాటి లైసెన్సులను సస్పెండ్ చేశారు. ఈ మేరకు 'తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్' (టీజీ సేఫ్) ఓ ప్రకటన విడుదల చేసింది.డ్రగ్స్ వింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ పోలీసులు సంయుక్తంగా రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. టాటా 1ఎంజీ, నెట్‌మెడ్స్, జెప్టో, అపోలో 24/7, మెడ్‌ప్లస్ మార్ట్, ఇన్‌స్టామార్ట్ వంటి ప్రముఖ ఆన్‌లైన్ సంస్థలతో భాగస్వామ్యం ఉన్న ఫార్మసీలను లక్ష్యంగా చేసుకుని ఈ తనిఖీలు చేపట్టారు.మొత్తం 23 సంస్థల లైసెన్సులను సస్పెండ్ చేయగా, వాటిలో 15 షాపుల లైసెన్సులను తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకు రద్దు చేశారు. మరో 8 షాపుల లైసెన్సులను నిర్దిష్ట కాలం పాటు సస్పెండ్ చేశారు. నిబంధనలు సరిగా పాటించని ఇంకో 9 మెడికల్ షాపులకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్-1940 ప్రకారం మందుల అమ్మకాలకు తప్పనిసరిగా ప్రిస్క్రిప్షన్ ఉండటం, రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ పర్యవేక్షణ, రికార్డుల నిర్వహణ వంటి అంశాలను అధికారులు పరిశీలించారు. ఎవరైనా అక్రమంగా ఆన్‌లైన్‌లో మందులు అమ్ముతున్నట్లు అనుమానం ఉంటే, తమ టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1800-599-6969కు ఫిర్యాదు చేయవచ్చని 'టీజీ సేఫ్' ప్రజలకు సూచించింది. ఈ సేవలు పనిదినాల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఏపీపీఎస్సీ అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పరీక్ష వాయిదా

డిసెంబర్ 2న జరగాల్సిన పరీక్షను 9వ తేదీకి మార్పు

పరిపాలనా కారణాలతో వాయిదా వేసినట్టు ప్రకటించిన ఏపీపీఎస్సీ

స్థానిక సంస్థల ఎన్నికల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం

మిగిలిన తేదీల్లోని పరీక్షలు యథాతథంగా జరుగుతాయని వెల్లడి



ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఉద్యోగ అభ్యర్థులకు కీలక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్‌జీయూకేటీ)లో లెక్చరర్ పోస్టుల భర్తీకి సంబంధించిన రాత పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు చేసింది. ఈ ఏడాది డిసెంబర్ 2న నిర్వహించాల్సిన కంప్యూటర్ ఆధారిత పరీక్షను డిసెంబర్ 9వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కమిషన్ తన అధికారిక వెబ్ నోట్‌లో వెల్లడించింది.పరిపాలనాపరమైన కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఏపీపీఎస్సీ పేర్కొంది. అయితే, డిసెంబర్ 2న రాష్ట్రంలో మూడో విడత స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండటమే ఈ వాయిదాకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఎన్నికల విధుల్లో పాల్గొనాల్సిన ప్రభుత్వ ఉద్యోగులతో పాటు అభ్యర్థులు చేసిన విజ్ఞప్తి మేరకు, రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ విషయాన్ని కమిషన్ దృష్టికి తీసుకువెళ్లింది. ఈ నేపథ్యంలోనే పరీక్ష తేదీని మార్పు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.ఈ మార్పు కేవలం డిసెంబర్ 2న జరగాల్సిన పరీక్షకు మాత్రమే వర్తిస్తుందని, మిగిలిన తేదీల్లో అంటే డిసెంబర్ 1, 3, 4, 5 తేదీల్లో జరగాల్సిన పరీక్షలు యథాతథంగా కొనసాగుతాయని కమిషన్ స్పష్టం చేసింది. వాయిదా పడిన పరీక్షను డిసెంబర్ 9న రెండు సెషన్లలో నిర్వహిస్తారు. ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు జరిగే సెషన్‌లో కెమికల్ ఇంజనీరింగ్, కామర్స్, కంప్యూటర్ సైన్స్, ఫుడ్ టెక్నాలజీ, జాగ్రఫీ, ఫిలాసఫీ, ఆర్‌జీయూకేటీ తెలుగు తదితర సబ్జెక్టులకు పరీక్ష ఉంటుంది. మధ్యాహ్నం 3:00 నుండి సాయంత్రం 6:00 వరకు ఆర్కియాలజీ, ఆర్కిటెక్చర్, ఈసీఈ, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, జియోఫిజిక్స్, ఆర్‌జీయూకేటీ ఇంగ్లీష్ వంటి సబ్జెక్టులకు పరీక్ష నిర్వహించనున్నారు.అభ్యర్థులు హాల్ టికెట్లు, ఇతర తాజా సమాచారం కోసం కమిషన్ అధికారిక వెబ్‌సైట్ (జూంఎఖజూ.స్రశీజ.అఅ)ను క్రమం తప్పకుండా సందర్శించాలని ఏపీపీఎస్సీ సూచించింది.

అమరావతిలో మీడియా సిటీ

రాజధానికి మరో ఆకర్షణ

ఏపీలో యానిమేషన్, గేమింగ్ రంగాల కోసం కొత్త ఏవీజీసీ-ఎక్స్‌ఆర్ పాలసీ

రూ.5,000 కోట్ల పెట్టుబడులు, లక్ష ఉద్యోగాల కల్పనే ప్రధాన లక్ష్యం

పరిశ్రమలకు మూలధన సబ్సిడీ, ఎస్‌జీఎస్‌టీ వాపసు వంటి భారీ ప్రోత్సాహకాలు

2026 నుంచి 2031 వరకు ఐదేళ్ల పాటు పాలసీ



ఆంధ్రప్రదేశ్‌లో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ (ఏవీజీసీ-ఎక్స్‌ఆర్) రంగాన్ని బలోపేతం చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రానికి రూ.5,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, లక్ష ఉద్యోగాల సృష్టిని లక్ష్యంగా పెట్టుకుని 'ఏవీజీసీ-ఎక్స్‌ఆర్ విధానం 2026-31'కి తుదిరూపునిచ్చింది. ఇందులో భాగంగా రాజధాని అమరావతిలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన 'మీడియా సిటీ'ని, ప్రత్యేక పార్కును అభివృద్ధి చేయనుంది.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ నెల 10న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నూతన విధానానికి ఆమోదముద్ర పడగా, తాజాగా దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. 2026 నుంచి 2031 వరకు ఐదేళ్ల పాటు అమల్లో ఉండే ఈ పాలసీ ద్వారా ఐదు యాంకర్ యూనిట్లతో పాటు మరో 100 కంపెనీల నుంచి పెట్టుబడులు రాబట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. అమరావతిలోని మీడియా సిటీలో అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి బాధ్యతను ఏపీ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీసీఆర్‌డీఏ)కు అప్పగించారు.ఈ విధానం ద్వారా రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించే సంస్థలకు ప్రభుత్వం భారీ ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఏవీజీసీ-ఎక్స్‌ఆర్ మౌలిక వసతుల కల్పనకయ్యే ఖర్చులో 50 శాతం రాయితీ (గరిష్ఠంగా రూ.2 కోట్లు), పార్కుల అభివృద్ధికి ప్రాజెక్టు వ్యయంలో 25 శాతం (గరిష్ఠంగా రూ.50 కోట్లు) సబ్సిడీని ప్రభుత్వం అందించనుంది. వీటితో పాటు ఐదేళ్ల పాటు వంద శాతం రాష్ట్ర జీఎస్టీ వాపసు, స్టాంప్ డ్యూటీ మినహాయింపు వంటి ప్రయోజనాలు కల్పించనుంది. రూ.200 కోట్ల పెట్టుబడితో కనీసం 200 మందికి ఉపాధి కల్పించే సంస్థలను 'మెగా ప్రాజెక్టులు'గా గుర్తించి ప్రత్యేక రాయితీలు అందజేయనున్నారు.అమరావతిలో సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఏవీజీసీ-ఎక్స్‌ఆర్ పార్కును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే ఆమోదం పొందిన రోబోటిక్స్, సెమీకండక్టర్ విధానాలతో పాటు ఈ ఏవీజీసీ-ఎక్స్‌ఆర్ పాలసీకి కూడా కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ద్వారా.. రాష్ట్రంలో సాంకేతిక రంగం, నవకల్పనల అభివృద్ధికి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టమవుతోంది.

అండాల అక్రమ సేకరణ కేసు - 120 నకిలీ ఆధార్ కార్డులు సృష్టించిన అమిత్ శర్మ ముఠా



మానవ అండాల అక్రమ సేకరణకు సంబంధించిన వ్యవహారంలో అమిత్ శర్మ ముఠా 120 ఫేక్ ఆధార్ కార్డులను సృష్టించినట్లు గుర్తించామని మల్కాజిగిరి పోలీసు కమిషనర్ సుమతి సోమవారం తెలిపారు. తమకు లభిస్తున్న ఆధారాలతో కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. అమిత్ శర్మ ముఠాకు హైదరాబాద్ లోని 17 ఫర్టిలిటీ కేంద్రాలతో సంబంధాలు ఉన్నట్లు నిర్ధారించామని తెలిపారు. వీటికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలతో పాటు అండాల సేకరణకు సంబంధించి జరిగిన వ్యవహారాల డాక్యుమెంట్‌లను పరిశీలిస్తున్నామన్నారు.పోలీసు కస్టడీ విచారణలో అమిత్ శర్మ ముఠా సభ్యులు వెల్లడించిన విషయాలకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తున్నామని సీపీ సుమతి తెలిపారు. మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ పరిధిలో మొత్తం 3 కేసులు నమోదు చేసి ఇప్పటి వరకు 9 మందిని అరెస్టు చేశామని తెలిపారు. 14 ఫర్టిలిటీ సెంటర్‌లకు నోటీసులు ఇచ్చామన్నారు. ఈ కేంద్రాలు అండాల సేకరణకు సంబంధించిన పాటించిన నియమ నిబంధనలు, వాటి కోసం సేకరించిన పత్రాలు, ఇతర కేవైసీ డాక్యుమెంట్‌లను పరిశీలిస్తున్నామని చెప్పారు. మరో వైపు డిఎమ్‌అండ్‌హెచ్‌వో అధికారులు కూడా ఈ వ్యవహారంపై విచారణను చేపడుతున్నారని సీపీ స్పష్టం చేశారు."మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ పరిధిలో మొత్తం 3 కేసులు నమోదు చేసి ఇప్పటి వరకు 9 మందిని అరెస్టు చేశాం. 14 ఫర్టిలిటీ సెంటర్‌లకు నోటీసులు ఇచ్చాం. ఈ కేంద్రాలు అండాల సేకరణకు సంబంధించిన పాటించిన నియమ నిబంధనలు, వాటి కోసం సేకరించిన పత్రాలు, ఇతర కేవైసీ డాక్యుమెంట్‌లు పరిశీలిస్తున్నాం. ఆధారాలు సేకరించిన తర్వాత ఫర్టిలిటీ సెంటర్ల పాత్రను తెలుసుకుంటాం.కాపాడిన మహిళలను ఓ ప్రత్యేక కేంద్రంలో పెట్టి వారి హెల్త్ ప్రొఫైల్‌ను సిద్ధం చేస్తున్నామన్నామని సీపీ సుమతి తెలిపారు. ముఠా ఇచ్చిన హార్మోన్ ఇంజక్షన్‌ల ద్వారా వారికేమైనా ఆరోగ్య సమస్యలు తలెత్తాయా, ఆ బాధితుల నుంచి ఎన్ని సార్లు అండాలను సేకరించారనే విషయాలను రాబడుతున్నట్లు వివరించారు. దర్యాప్తులో వెలుగుచూస్తున్న అంశాలతో మరికొన్ని అరెస్టులు ఉంటాయని సీపీ సుమతి పేర్కొన్నారు. ఆ వివరాలను ఇప్పుడే వెల్లడించలేమని త్వరలో అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని చెప్పారు.

Editor, Published & Owned By:N RANGANATH & Printed at M/S Achukatla Publications, # 9/1542, M.R.Road, Gooty R.S., Gooty - 515402, Ananthapuramu District. Andhra Pradesh. Published at # 1-3,Gajarampalli Village & Post, Pamidi Mandal, Pamidi - 515775 Ananthapuramu District. Andhra Pradesh. E-Mail:editorranganath@gmail.com
Cell: 8466071258 P.R.G.I. Regd. No:APTEL/26/A8343